ప్రభాత
# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శుక్రవారం 05 డిసెంబర్ 2025


## వైసిపికి షాక్

### కడప మేయర్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్
### ఈనెల 7న కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం
### 11న మేయర్ ఎన్నిక

**రాజంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త**

కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్,డిప్యూటీ మేయర్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈనెల 7న కార్పొరేషన్ కార్పొరేటర్ తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న మేయర్ ఎన్నిక చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల ఆధారిటీని ఆదేశించారు. ఎన్నిక ప్రక్రియ పూర్తి కాకపోతే ఎన్నికల కమిషన్ కు సమాచారం అందించాలని నోటిఫికేషన్ లో పేర్కొన్నారు. కాగా కడప కార్పొరేషన్ లో నిబంధనలకు విరుద్ధంగా కడప మేయర్ సురేష్ బాబు కుటుంబం అభివృద్ధి పనులు చేపట్టడం, నిధుల దుర్వినియోగం చేయడంతో అనర్హత వేటు వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిన్న ఎంపై హైకోర్టును కూడా కడప మేయర్ ఆశ్రయించారు. హైకోర్టులో కూడా ఆయనకు ప్రతికూలంగా తీర్పు వెలుబడింది. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ మేయర్ ఎన్నిక చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్ నిర్ణయంతో వైసిపి షాక్కు గురైంది.

## అక్రమ భవన నిర్మాణాలను క్రమబద్ధీకరించండి

### పట్టణ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవన్‌కుమార్

**మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**



ఆర్డీని సత్కరిస్తున్న కమీషనర్

మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవన నిర్మాణాలను బిపిఎస్ పథకం కింద క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవన్ కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాలులో రీజనల్ డైరెక్టర్ పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిపిఎస్ పథకాన్ని అక్రమ భవన నిర్మాణ యజమానులకు తెలియజేసి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు పట్టణంలో అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఎన్ని భవనాలకు నోటీసులు జారీ చేశారు, ఎన్ని భవనాలకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తున్నాయి అన్న విషయాలను టౌన్‌ప్లానింగ్‌శాఖ అధికారుల ద్వారా అడిగి తెలుసుకొన్నారు. ముఖ్యంగా బఫర్‌జోన్‌ల్లో నిర్మించే అక్రమ భవనాలపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. బిపిఎస్ పథకంకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ ఆదాయానికి గండికొట్టే విధంగా వ్యవహరిస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ లేవుట్లు నిర్మించే భవనాలకు సంబంధించి కూడా బిపిఎస్ పథకాన్ని వివరించి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, టౌన్‌ప్లానింగ్‌శాఖ అదికారులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

# ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా : మంత్రి మండిపల్లి





**రాయచోటి డిసెంబర్ 4 ప్రభాతవార్త**

నన్ను ఆదరించిన రాయచోటి నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ప్రైవేట్ విద్యాసంస్థల జెఏసి ఆధ్వర్యంలో అభినందన సభను ఘనంగా నిర్వహించారు. ఈ అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడానికి హర్షిస్తూ జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రైవేటు విద్యా సంస్థల జేఏసీ ఆధ్వర్యంలో థాంక్యూ సీఎం సార్ అంటూ భారీ ఎత్తున కృతజ్ఞత ర్యాలీ కృతజ్ఞతాభినందన సభను నిర్వహించారన్నారు కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ సహకారంతో అన్నమయ్య జిల్లాను అన్ని జిల్లాలకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా కేంద్రానికి రాయచోటి అనువైన ప్రాంతమని నేటి సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు జిల్లా ఏర్పాటు కోసం సహకరించిన మంత్రివర్గ ఉపసంఘం కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు రాజకీయ పార్టీ నిర్వహించలేని విధంగా ప్రైవేటు విద్యా సంస్థలు జేఏసీ ముందుకు వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞత తెలుపుతూ సభ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా 10 వేల మందికి పైగా స్వచ్ఛందంగా భారీ స్థాయిలో మహా ర్యాలీ చెక్పోస్ట్ శివాలయం నుంచి నేతాజీ సర్కిల్ వరకు కోలాటాలు చెక్కభజనతో ఉత్సాహంగా సాగిందన్నారు జనం తరలి రావడం గొప్ప విషయం అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ సహకారంతో రానున్న మూడు సంవత్సరాలల్లో జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు ..ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటిని జిల్లా కేంద్రంగా కాపాడడంలో మంత్రి మండిపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి చేసిన కృషి అపారమైందని,ఆయన ముందడుగు వల్లే ప్రజల ఆకాంక్ష నెరవేరిందని తెలిపారు. అనంతరం మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి,మదన మోహన్ రెడ్డి లు ఘనంగా సత్కరించగా,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టిడిపి నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, మోర్యా రెడ్డి,టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా,ఏపీఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్ రెడ్డి,టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ,నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు,జనార్దన్,జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ రాజారెడ్డి,బిట్స్ భాస్కర్, సాయి ఇంజనీరింగ్ సుధాకర్ రెడ్డి,షిరిడీ సాయి చలమారెడ్డి,శ్రీహరి డిగ్రీ కళాశాల రాజశేఖర్,భారతి విద్యామందిర్ వెంకట్రామిరెడ్డి, వశిష్ఠ ప్రభాకర్,ఎస్.వి విద్యామందిర్ రమణారెడ్డి,ఐ కె స్కూల్ ఇషాక్,ప్రభుత్వ,ప్రయివేట్ కళాశాలల విద్యార్థులు, వైద్యులు డా లక్ష్మీప్రసాద్, డా చింతల అరుణ్, డా ప్రభాకర్ రెడ్డి,డానారాయణరెడ్డి, డా కేతిరెడ్డి సాయి కృష్ణారెడ్డి ,ప్రముఖ న్యాయవాదులు,రోటరీ క్లబ్ కూనా కృష్ణ దేవరాయలు, పెట్రోల్ బంక్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి

**చిన్నమండెం డీసెంబర్ 04 ప్రభాత వార్త:**

మండలంలోని మల్లూరు జిల్లాపరిషత్ హైస్కూల్ లో నేడు జరగనున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొంటారని మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప,ఆగ్రామ నాయకులు తెలిపారు,ఉదయం 10 గంటలకు జరిగే ఈ సభకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు కోరారు.

### కోర్టులో లొంగిపోయిన కిడ్నీ రాకెట్ కేసులో
## కీలక నిందితుడు డాక్టర్ పార్థసారథి రెడ్డి

**మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 4 ప్రభాతవార్త**



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక అన్ని నిధులైన డాక్టర్ పార్థసారథి రెడ్డి గురువారం సాయంత్రం కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయాడు. గత నెల 10వ తేదీ నుంచి పరారీలో ఉన్న వైద్యుడు లొంగిపోయాడు. మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా కిడ్నీ రాకెట్ వ్యవహారం బట్టబయలు కావడం తెలిసిందే. ఈ కేసులో విశాఖకు చెందిన యమున కిడ్నీని తీసి మరొకరికి అమర్చిన సంఘటన లో అపరేషన్ వికటించి యమున మృతి చెందటంతో కిడ్నీ రాకెట్ దందా వెలుగు చూసింది. ఈ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, బాల రంగడు అలియాస్ బాలు (మదనపల్లి డయాలసిస్ కేంద్రం మేనేజర్), మెహరాజ్ (కదిరి డయాలసిస్ సెంటర్ మేనేజర్), బ్రోకర్లుగా వ్యవహరించిన పెళ్లి పద్మ, కాకర్ల సత్య, మృతురాలు యమున స్నేహితుడు సూరిబాబు, కడప ప్రకాష్ నగర్ కు చెందిన ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు సుమన్, కొండయ్య లను అరెస్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడైన బెంగళూరు డాక్టర్ పార్థసారథి రెడ్డి అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు నెలరోజులుగా గాలింపు చేస్తున్నారు. టెక్నికల్ ఆధారంగా అతని ఆచూకీ పోలీసులు కనుక్కోవడంతో పార్థసారథి రెడ్డి పోలీసులకు దొరక్కుండా మదనపల్లి రెండవ అడిషనల్ సీనియర్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట నింగిపోయాడు. అతన్ని రిమాండ్ కు తరలించారు. కీలక నిందితుడు పార్థసారథి రెడ్డి కావడంతో అతను అరెస్టుతోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. కోర్టులో లొంగిపోయిన పార్థసారథి రెడ్డిని త్వరలోనే పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించి అవకాశం ఉంది.

## రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని కలెక్టర్‌కు వినతి


రాజంపేటలో జిల్లా కేంద్రం చేయాలని కలెక్టరుకు వినతి పత్రం అందజేస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త**

రాజంపేటలో అన్నమయ్య జిల్లా కేంద్రం చేయాలని రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. రాజంపేట మండలం బోయినపల్లిలో డిడిఓ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ ను కలిసి కోరారు. రాజంపేటను జిల్లాకేంద్రం చేయడానికి ఉన్న వసతులు, అర్హతలు గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో జనసేన నేత ఎల్లటూరు శ్రీనివాస్ రాజు ,టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు టి.లక్ష్మీ నారాయణ, గీతాంజలి వెంకట రమణ,రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ కుమార్ రాజు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఇడిమడకల కుమార్ ,టీడీపీ మండల రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవి కుమార్ నాయుడు , టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్,జిల్లా అధ్యక్షుడు పోలి శివ కుమార్, ప్రవీణ్ జనసేన నేత శివరామ రాజు, మంగళూరు మాజీ జెడ్పిటిసి సమ్మెట శివప్రసాద్, బిజెపి నేత షబ్బీర్ అహమద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

# కృష్ణజింకల మనుగడ ప్రశ్నార్థకం

### పి.టి.యం, ములకలచెరువు మండలాల్లో సంచారం...
### రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న కృష్ణజింకలు..

**ములకలచెరువు, డిసెంబరు 4, ప్రభాతవార్త**


ఫైల్‌ఫోటో

ములకలచెరువు, పి.టి.యం మండలాల్లో కృష్ణ జింకలు సుమారు 2వేలు పైగా సంచరిస్తున్నాయి. అయితే వీటికి మనుగడ కరువైంది. అటవీశాఖ వీటిని సంరక్షించాల్సి వుండగా నిధులు కొరత కారణంగా వీటిని సంరక్షించలేక పోతున్నారు. అరుదైన కృష్ణ జింకలకు అడవుల్లో, కొండల్లో, ఆహారం, నీళ్ళు, దొరకక గ్రామలల్లోకి వస్తున్నాయి. గ్రామాలల్లోకి వస్తూ రోడ్లు దాటుతుండటం వల్ల వాహనాలు కింద పడి చనిపోతున్నాయి. కొన్ని గ్రామాలల్లోకి వచ్చి కుక్కలు దాడుల్లో చనిపోతున్నాయి. గత మూడేళ్ళగా ఈ ప్రమాదాల్లో, దాడులు వల్ల కృష్ణ జింకలు చనిపోయినట్లు ఆటవీశాఖ అధికారులు పరిశీలనలో తెలిసింది. ముంబాయ్ చెన్నై జాతీయ రహదారిలోనే కృష్ణజింకలు ఎక్కువగా వాహనాల కింద పడి చనిపోతున్నాయి. పంట పొలాల్లో వేసిన విద్యుత్ కంచె కారణంగాను, పాడుపడిన బావుల్లో పడి మరణిస్తున్నాయి. దేశంలోనే అరుదైన జంతువుగా చెప్పబడే కృష్ణజింకలు తంబళ్ళపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పి.టి.యం ప్రాంతల్లో పగటిపూటే పొలాల్లో చెరువుల్లో ఉన్న గడ్డిని తింటూ కనిపిస్తూంటాయి. వీటి సంరక్షణ కోసం ఆటవీశాఖ అధికారులు శ్రద్ద తీసుకోవాల్సి వుండగా ఏ మాత్రం పట్టించుకోలేకపోతున్నారు. జింకలు ఎక్కువగా సంచరించే సంచరించే ప్రాంతల్లో ప్రాంతల్లో రోడ్డు దాటకుండా ఉండేందుకు కంచె ఏర్పటు చేయాల్సి వుంది. అడవుల్లో కొండల్లో, జింకల కోసం నీటితొట్టెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటి ఆహారం కోసం కొన్ని వృక్షాలను పెంచాల్సిన అవసరం కూడా వుంది. వేసవి సమయల్లో అడవులకు అగ్గి పెట్టడంతో అడవుల్లో ఆహారం లేక జింకలు రాత్రుల్లో గ్రామాల్లోకి వస్తూన్నాయి: అటవీశాఖ అధికారులు స్పందించి ములకలచెరువు, పి.టి.యం ప్రాంతాల్లో సంచరించే కృష్ణజింకల సంరక్షణ కోసం ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం వుంది. లేదంటే కృష్ణజింకలు ఈ ప్రాంతంలో కనుమరుగైయ్యే పరిస్థితి వుంది.

## ఎడతెరిపిలేని వాన - స్తంభించిన జనజీవనం

**రైల్వేకోడూరు డిసెంబర్ 4 (ప్రభాతవార్త )::**

మండలంలో గురువారం ఉదయం నుండి దాదాపు నాలుగు గంటల వరకు ఎడతెరిపిలేని వానతో పట్టణంలో జనజీవనం స్తంభించిపోయింది ముఖ్యంగా ఉదయమున 11 గంటల సమయము నుండి మూడున్నర వరకు భారీగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులు జలపాతాన్ని తలపించింది పూర్తిగా ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికి అక్కడ స్తంభించిపోయాయి ముఖ్యంగా ఇదే వానలో సంబంధిత అధికారులు వరద ప్రాంతాలైన వాగేటికోన రెడ్డివారిపల్లి చెరువు ఉప్పరపల్లి చెరువు తదితర ప్రాంతాలలో తహసిల్దార్ కోనేటి అమర్నాథ్ డ్రోన్ కెమెరాలు ద్వారా పర్యవేక్షణ నిర్వహించి పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు అత్యవసరమైతేనే బయటకు రావాలని లేనిపక్షంలో ఇంటి వద్ద తలదాచుకోవాలని ఆదేశించారు ముఖ్యంగా రెడ్డివారిపల్లి వాహనాలు వెళ్లే దారి పూర్తిస్థాయిలో వరద దాటికి కొట్టుకొని పోవడంతో వేరే ప్రాంతంలో నుండి రాకపోకలు సాగించారు అయితే బాల్లపల్లి అటవీ సమీపం ప్రాంతంలో తరలి రావడంతో ప్రయాణికులు మరియు వాహనదారులు ఆసక్తిగా కల్లారా చూడసాగారు ఈ వర్షపు దాటికి కళాశాలు పాఠశాలలు వదిలేశారు అదే తోవలో కోడూరు వైసిపి నాయకులు మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజ రెడ్డి కట్టించిన బస్ షెల్టర్ వర్షానికి ప్రయాణికులు మరియు ప్రజలు తట్టుకోలేక ఒకసారి గా బస్ షెల్టర్ కిక్కిరిసిపోయింది.

## కలికిరిలో రైలు ప్రమాదంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

**కలికిరి, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

కలికిరి మండల కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన కలికిరిలో కలవరం లేపింది. కలికిరి పీఎస్ సమీపంలో ఉన్న లింగయ్య కుమారుడు వీరభద్రయ్య గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్తిమితం లేకుండా తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో తన కుటుంబ సభ్యులకు భారం కాకూడదని ఆలోచించడం దాంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. అదే విధంగా పుంగనూరు నియోజకవర్గం సోమలమండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్ కలికిరి అమర్‌నాథ్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మునికుమార్ మద్యానికి బానసై కుటుంబంలో తన భార్య శ్రీదేవితో తరచూ ఘర్షణ పడేవాడు. వీరభద్రయ్య, మునికుమార్‌లు ఇద్దరూ మద్యం సేవించడంతో పాటు స్నేహంగా ఉంటూ బుధవారం రాత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ మద్యం సేవించడంతో రైల్వే స్టేషన్ అధికారులు మందలించడంతో అక్కడి నుంచి కొంత దూరం వచ్చి రైల్వే ట్రాక్‌పై కూర్చొని మద్యం సేవిస్తుండడంతో ఆ సమయంలో నాగర్‌కోయల్ నుంచి ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు రావడం జరిగింది. వారు మద్యం సేవిస్తూ ఉండడంతో రైలు ఢీకొంది. దీంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సమాచారం పైలెట్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు వీరభద్రయ్యకు భార్య భాగ్యలక్ష్మి, ఇంజినీరింగ్ చదివే కుమాడు, కుమార్తె ఉన్నారు. మృతుడు మునికుమార్‌కు ఏడాది బాబు ఉన్నాడు. ఇద్దరు మద్యానికి బానిసై కుటుంబంలో ఒకరు అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకోవాలని ఒకరు, మరొకరు భార్యతో ఘర్షణ పడి క్షణికావేశంలో అతిగా మద్యం సేవించి మరొకరు రైలు కింద పడి మృతి చెందడంతో కలికిరిలో కలకలం రేపింది. బాధితుల ఫిర్యాదు మేరకు రైల్వే జీఆర్‌పీ ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కలికిరిలో ఎన్నడూ లేని విధంగా రైలు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందడంతో కలికిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కుటుంబాన్ని పోషించే భర్తలు చనిపోవడంతో వీరభద్రయ్య, మునికుమార్‌ల కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. తమను ఆదుకునే దిక్కెవరని మునికుమార్ భార్య శ్రీదేవి కన్నీరుమున్నీరయ్యారు. అది చూసిన పలువురు కంటతడి పెట్టారు.


భర్త చనిపోవడంతో కన్నీరు మున్నీరవుతున్న భార్య శ్రీదేవి

## ఎడతెరిపి లేని వర్షం ... ఉప్పొంగిన వరద.

### కడప నెల్లూరు జిల్లాలకు స్తంభించిన రవాణా.
### సమీక్షించిన సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన.

**చిట్వేలి, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**


అనుంపల్లి వద్ద వరదను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్.


ఎం రాచపల్లి వద్ద పూర్తిగా ధ్వంసమైన వంతెన.

లేకుంటే అనావృష్టి, కురిస్తే కుంభవృష్టి అన్న తీరుగా దిత్వా తుఫాను ప్రభావంతో గడిచిన వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూ ఉండడంతో మండల పరిధిలోని అన్ని చెరువులు, వాగులు, వంకలు పూర్తిస్థాయిలో నిండాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎంఎం 85.6 మేర వర్షం కురవడంతో రాజుకుంట చెరువు అలుగు నీటికి, రాపూరు వంక నీరు తోడవడంతో రాజగుంట క్రాస్ శ్రీ ఆంజనేయ స్వామి గుడి అనుంపల్లి వద్ద ఉన్న వంతెన పై అత్యధికంగా నీరు ప్రవహించింది. దీనితో అప్రమత్తమైన రెవెన్యూ పోలీస్ యంత్రాంగం బస్సులు, ప్రయాణికుల వాహనాలను ఉదయం నుంచే నిలిపివేశారు. ఈ నీటికి యల్లమ రాజు చెరువు అలుగునీరు ప్రవాహంతో ఎం రాచపల్లి గ్రామానికి వెళ్లే వంతెన, భారీ సిమెంటు పైపులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. తుమ్మ కొండ వంతెన పై వరద నీరు ఉధృతితో రాకపోకలు నిలిపివేశారు. సదరు గ్రామస్తులు మా ఇబ్బందులను గత ప్రభుత్వంతోపాటు కూటమి ప్రభుత్వానికి పలు మార్లు తెలియపరిచామని ఎలాంటి పురోగతి లేదని వాపోయారు. కడప నెల్లూరు జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో అనుంపల్లి వద్ద పద్దె ఎత్తున వాహనాలు ప్రయాణికులు నిలిచిపోయారు. యల్లమ్మ రాజు చెరువుకు ఉన్న పంట కాలువలను ఇంటి నిర్మాణ దారులు పూర్తిగా మూసివేయడంతో వర్షపు నీరు ఎటు వెళ్లలేక అంబేద్కర్ సర్కిల్ ఇండ్ల మధ్యన,రోడ్ల వైపుకు అధికంగా చేరింది. ఇబ్బందులను గుర్తించి పంట కాలువలను తెరిపించవలసిన ఇరిగేషన్ మరియు రెవిన్యూ అధికారులు మౌనంగా ఉండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి.కాగా గురువారం ఉదయం డిఎస్పి రామ్నాథ్ హెగ్డే చిట్వేలిలో వరద ఇబ్బందులను పరిశీలించారు.ఎలాంటి నష్టం జరగకుండా పోలీసు యంత్రాంగం పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

### సమీక్షించిన సబ్ కలెక్టర్ భావన:

రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన గురువారం సాయంత్రం అనుంపల్లి వద్ద వరద ఉధృతిని సమీక్షి ంచారు. నీటి ఉధృతి తగ్గేంతవరకు ప్రయాణికులను వాహనాలను అనుమతించవద్దని అధికారులకు సూచించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్లపై ప్రవహిస్తున్న నీటికి గల కారణాలను అడిగి తెలుసుకు న్నారు. తక్షణమే ఇబ్బందిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిఖిల్ కుమార్, ఏఎస్ఐ వెంగయ్య, ఆర్ అండ్ బి అధికారి నరేంద్ర, రెవిన్యూ అధికారులు భాస్కర్, సుధాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రిజిస్ట్రేషన్ గంటలోపే పూర్తి చేయడానికి కృషి చేస్తాం

### ఇంచార్జ్ జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి

**బి .కొత్తకోట డిసెంబర్ 4 ప్రభాతవార్త :**



భవిష్యత్తులో ప్రతి రిజిస్ట్రేషన్ గంటలోపే పూర్తిచేసే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడానికి కృషి చేస్తామని చిత్తూరు ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన బి.కొత్తకోట సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రిజిస్టర్ కార్యాలయంలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లడంతో గతవారం రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ తనిఖీ చేసి విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో భాగంగా చిత్తూరు ఉమ్మడి జిల్లా రిజిస్టార్ వెంకటరమణమూర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కార్యాలయంలో రెండు డాక్యుమెంట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని వాటిపై విచారణ చేశామని సబ్ రిజిస్టర్ పరిధిలో వ్యవసాయ భూమి రిజిస్ట్రర్కు వన్ బి, అడంగల్ తో ముడిపడి ఉంటుందన్నారు. స్టాంప్ వెండర్లు స్టాంపులు అధిక ధరలకు అమ్ముతున్నారని అదేవిధంగా వెండర్లే డాక్యుమెంట్ రైటర్లుగా ఎక్కువ కమిషన్లు తీసుకుంటున్నారని వచ్చిన ఫిర్యాదులపై విచారించినట్లు చెప్పారు. ఈ కార్యాలయానికి నలుగురు స్టాంప్ వెండర్లకు లైసెన్సు ఉందని ఇక్కడ తీవ్రతను బట్టి ఆదనంగా వెండర్లు తోబాటు సిబ్బంది కొరత తీర్చడానికి కృషి చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కు డాక్యుమెంట్ రైటర్ లే ప్రామాణికం కాదని ఎవరైనా తమ ఇంటి వద్ద నుండే ఆన్లైన్లో పబ్లిక్ డేటా ఎంటర్ తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని రైటర్ ధ్రువీకరణ కచ్చితంగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ కు వేలిముద్రలు రానివారికి ఐరిష్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని చెప్పారు. రిజిస్ట్రేషన్ కు మొబైల్ నెంబర్ కు ఆధార్ లింక్ తప్పనిసరి అని సూచించారు. రిజిస్ట్రేషన్ కు సర్వే నెంబర్లు లేని భూములకు పాత డాక్యుమెంట్ క్రమబద్ధీకరణ చేయాలని పలువురు ఆయనకు విన్నవించారు. డాక్యుమెంటేషన్ తోపాటు ఐరిష్ ఇతర సమస్యల పరిష్కారానికి డాక్యుమెంట్ రైటర్లు ప్రజలకు, రైతులకు అవగాహన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. బి. కొత్తకోట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారణ చేసి భవిష్యత్తులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.


జాతీయ జెంబోరీలో కార్యక్రమంలో మంత్రి మండిపల్లిని సత్కరిస్తున్న అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

## పేరెంట్స్ మీటింగును విధిగా నిర్వహించాలి.

**చిట్వేలి, డిసెంబర్ 4,ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మూడవ దఫా కార్యక్రమాన్ని శుక్రవారం తప్పనిసరిగా అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఖాజా మొయిద్దీన్, ఈశ్వరయ్యలు తెలిపారు. కాగా ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కె కె చౌదరి హాజరవుతున్నట్లు సమాచారం.

## సుండుపల్లెలో అత్యధికంగా వర్ష పాతం నమోదు

**సుండుపల్లె, డిసెంబర్ 04,ప్రభాతవార్త :**

మండలం లో అత్యధికంగా బుధవారం ఉదయం 7.00గంటల నుండి గురువారం 6.00 గంటల వరకు 46.06 మిల్లి మీటర్లు వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ మహబూబ్ చాంద్ అలాగే పించ నందు 12.40 మిల్లి మీటర్లు వర్షపాతం నమోదు అయిందని పించ ఎ ఇ ఇ నాగేంద్ర నాయక్ తెలియజేసారు.

## అంధకారంలో బయనపల్లె దళితవాడ

**బద్వేలు రూరల్, డిసెంబర్ 4 (ప్రభాతవార్త):**

మండలంలోని బయనపల్లె దళితవాడలో విద్యుత్ లేక ప్రజలు రాత్రంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్నామని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. రాత్రి అయ్యిందంటే గ్రామమంతా అంధకారంలోకి మారే దుస్థితి ఏర్పడుతోందన్నరు. గ్రామంలో విద్యుత్ సమస్య గురించి ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలిక మరమ్మతులు చేపడతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత వర్షాభావ మారిన పరిస్థితులలో విష పురుగులు తిరుగుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి దళితవాడలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలి..

**కడప కార్పొరేషన్ డిసెంబర్ 4 ప్రభాతవార్త:**



ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలని ప్రజలు నుండి ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజా వైద్య అధికారి సౌదగిరి రమేష్ తెలిపారు. గురువారం కడప నగరంలోని 15, 16, 17, డివిజన్ లోని శివానందపురం, రిమ్స్ రోడ్డు, ఇందిరానగర్, జ్యోతి కెమికల్ ప్రాంతాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల మూడు రోజులుగా వర్షం కురుస్తుందని వర్షానికి సైడ్ కాలువలలో చెత్త ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కాలువలలో నీళ్ల ఆగిపోతున్నాయని అలా సైడ్ కాలువలలో నీళ్ల నిలబడకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయాలని సంబంధిత శానిటరీ వర్కర్లను ఆదేశించారు. గార్బేజ్ పాయింట్లలో చెత్త లోడ్ చేసిన వెంటనే ఆ ప్రాంతంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ తప్పనిసరిగా చల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పించ నుండి ద్వారా నీరు విడుదల..

**సుండుపల్లె, డిసెంబర్ 04,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ముదుంపాడు గ్రామం లో ఉన్న పించ ప్రాజెక్ట్ మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా పించలోకి అధిక నీరు అధికంగా ఒక డోర్ తీసి 1306 క్యూసెక నీరు వదులు తున్నామనియు,కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కులు మరియు ఎడమ కాలువ ద్వారా ఒక క్యూసెక్కు నీరు విడుదల చేస్తున్నామనియు, ప్రస్తుత ప్రాజెక్ట్ లెవెల్ 1000అడుగులు ఉందనీయు ఎఇఇ నాగేంద్ర నాయక్ తెలియజేసారు. దిగువ ప్రాంతమున ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేసారు.

## మొయిళ్లకాల్వ గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం

**పెండ్లిమర్రి, డిసెంబరు 4, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పెండ్లిమర్రి పీఎస్ పరిధిలోని మొయిళ్లకాల్వ గ్రామంలో ఎస్సై మోహన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో చాలా మంది వ్యక్తులు సైబర్ మోసాలకు గురవుతున్నారని నేరాలు జరుగుతున్న తీరును ప్రజలకు వివరించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని కొంత మంది సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేసి తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని ఇలా రక రకాలుగా తమ పిల్లలపై, తమపై బెదిరింపు కాల్స్ చేస్తూ వారి నుంచి నగదు వసూలు చేస్తూ ఉంటారన్నారు. ఎవరైనా ఈ తరహా కాల్ చేస్తే సమాచారాన్ని డయల్ 112 లేదా 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రోశయ్య రాజకీయ భీష్మాచార్యుడు, గొప్ప ఆర్థికవేత్త

**వేంపల్లి: డిసెంబర్ 04 ప్రభాత వార్త:**



స్వర్గీయ కొణిజేటి రోశయ్య రాజకీయ భీష్మాచార్యుడు, అజాతశత్రువు ,గొప్ప ఆర్థికవేత్త, పరిపాలన అధ్యక్షుడు, అసెంబ్లీ కేసరి అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కొనియాడారు. గురువారం వేంపల్లి లో స్వర్గీయ రోశయ్య 4 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధిగా, కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీకి రోశయ్య ఎనలేని సేవ చేశారు. ఆయన జీవన ప్రస్థానం నేటి తరానికి, భావితరాలకు ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకం, మార్గదర్శకం అని తులసి రెడ్డి కొనియాడారు.

## సచివాలయాన్ని సందర్శించిన జనసేన నేత

**వేంపల్లి:డిసెంబర్:04:(ప్రభాత వార్త)**



వేంపల్లి పట్టణంలోని 6వ సచివాలయాన్ని పులివెందుల జనసేన నేత డాక్టర్. రవిశంకర్ సందర్శించడం జరిగింది. సచివాలయ సెక్రటరీ ఎం కొండయ్య మీటింగ్ పని మీద వేంపల్లి మండల డెవలప్మెంట్ ఆఫీసుకు వెళ్లినందున అక్కడున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులను అక్కడున్న సమస్యలపై అడిగి తెలుసుకోవడం జరిగింది వారు సచివాలయంలో వైండింగ్ సరిగా లేనందున ఫ్యాన్లు సరిగ్గా తిరగడం లేదని,కరెంటు ఎక్కువ తక్కువ రావడం వల్ల ఇన్వర్టర్ కూడా సరిగ్గా పని చేయలేదని అలాగే స్టేషనరీ కూడా లేదని చెప్పారు. అదేవిధంగా డాక్టర్ రవిశంకర్ సచివాలయ పరిధిలోని క్లినిక్ ప్రాంతాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగులయ్య మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## కేవీపల్లె ఎస్ఐగా వెంకటశివకుమార్

**కేవీపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త:**

కేవీపల్లె ఎస్ఐగా బి. వెంకటశివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన చిన్నరెడ్డెప్ప బదిలీపై పుల్లంపేటకు వెళ్లారు. అన్నమయ్య వీఆర్ లో ఉన్న వెంకటశివకుమార్ కేవీపల్లె ఎస్ఐగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

## వైసిపి గల్ఫ్ కన్వీనర్‌గా మూడవ పర్యాయం ఇలియాస్

**కడప కార్పొరేషన్ డిసెంబర్ 4 ప్రభాతవార్త:**



వైయస్సార్ సిపి గల్ఫ్ కన్వీనర్ గా వరుసగా మూడో పర్యాయం కూడా కడప నగరానికి చెందిన ఇలియాస్. బిహెచ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. 2015, 2024 లో రెండు పర్యాయలు గల్ఫ్ కన్వీనర్ గా గల్ఫ్ ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరించడమే కీలక పాత్ర వహించారు. గల్ఫ్ లో ప్రవాసాంధ్రులతో వైసిపి కమిటీలు వేసి నిరంతరం పార్టీ అభ్యున్నతికి పనిచేసినట్లు తెలిపారు. గురువారం కడపలో ఇలియాస్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో మూడవసారి గల్ఫ్ కన్వీనర్ గా నియమించినందుకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వై.యస్. జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన ఎన్ ఆర్ ఐ గ్లోబల్ కన్వీనర్ ఏ.సాంబశివ రెడ్డి, ఎంపీలు వై.యస్. అవినాష్ రెడ్డి, పి. మిథున్ రెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, మాజీ మేయర్ కె. సురేష్ బాబు, కువైట్, గల్ఫ్, ఖతార్, యూఏఈ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## అవకతకలకు పాల్పడితే కఠిన చర్యలు

**పులివెందుల ,డిసెంబర్ 4 ప్రభాత వార్త :**



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహార పదార్థాలను పంపిణీ చేయడంలో అవకత వకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపా ల్ రెడ్డి హెచ్చరించారు. గురువారం పులివెందుల అంకాలమ్మపేట పరిధిలోని భారతి వీధిలోని అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రుడ్లు,పాలు,చిక్కీలు పంపిణీ సక్రమంగా పంపిణీ జరుగుతోందా లేదా అని రికార్డులను ,చిన్నారుల హాజరు నమోదు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ చిన్నారులకు అందించాల్సిన ఆహారం, సేవలలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అవకతవకలు జరగకుండా పూర్తి బాధ్యతతో కేంద్రాన్ని నిర్వహించాలని స్పష్టంగా ఆదేశించారు. ఏమైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా మైసురా రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లే అవుట్లలో నిర్మాణాల తొలగింపు



**బద్వేలు, డిసెంబర్4 (ప్రభాతవార్త):**

మున్సిపాలిటీ పరిదిలోని మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో సర్వేనెం.887లో అనధికారికంగా వేసిన లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం 2020లో భాగంగా నిర్మాణాలు అక్రమ లే అవుట్లు గా తేల్చడం జరిగిందని కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఈ లే అవుట్లు ఏలాంటి ప్లాట్లు రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు నమోదు చేయలేదన్నారు. అందువలన లే అవుట్ కాంపౌండ్‌ను తొలగిస్తున్నట్లుతెలిపారు.గతంలో ఈ లే అవుట్ పరిశీలించడం జరిగిందని అయినప్పటికీ క్రమబద్ధీకరణ కింద రెగ్యులరైజేషన్ చేసుకోలేదన్నారు. పురపాలక సంఘంలోని16 అనధికారిక లేఅవుట్లు ఉన్న ప్లాట్లు మరియు వ్యక్తిగత ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ 2020 ద్వారా దరఖాస్తు చేసుకుని లబ్ది పొందాలని తెలియజేస్తున్నామన్నారు. అట్లు కానిచో ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా సదరు ప్లాట్‌పై తగు చర్యలు తీసుకోవడం జరుగతుందని కమిషనర్ పేర్కొన్నారు.

## వృద్ధాశ్రమం నందు అన్నదానం

**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 4 ప్రభాత వార్త**



సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటి ఆధ్వర్యంలో గురువారం పట్టణ శివార్లాలోని రైల్వేస్టేషన్ ప్రక్కనగల శ్రీ వీర బ్రహేంద్ర వృద్ధాశ్రం నందు శెట్టివారిపల్లి వాసులు స్వర్గీయ మండాది బసిరెడ్డి 10వ వర్ధంతి పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం,పండ్లు పంపిణి చేసారు.సిర్డ్ సొసైటీ ప్రసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు సపర్యలు చేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు పోలిచర్ల సుబ్బరాయుడు, మేనేజర్ రఘురామ్ ఎంతో అభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఒంటెద్దు చెన్నమ్మ, సభ్యులు గంగభవాని, రమణమ్మ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యాత్మక కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**చాపాడు. డిసెంబర్ 4.ప్రభాతవార్త :**



జిల్లా పోలీసు ఉన్నతాధికారి నచ్చికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చాపాడు పోలీస్ స్టేషన్నుమైదుకూరు డి.ఎస్.పి, జి. రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిష్కారంకాని కేసులు, రికార్డులు, స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. అనంతరం ప్రజల సమస్యలనుస్నేహపూర్వకంగా పరిశీలించాలని, ఉమెన్ అవేర్నెస్ కల్పించాలని సూచించారు. కేసుల పరిష్కారంలో చాపాడు పోలీసుల పనితీరుపై ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు గ్రామీణ సిఐ శివశంకర్ యాదవ్, చాపాడుఎస్సై చిన్న పెద్దయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తిరుమల బదులు ఒంటిమిట్టకు పాదయాత్ర

### ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

**రాజంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త**



కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి చెంతకు పాదయాత్రకు అన్నమయ్య కాలిబాటలో తనకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమ్మనారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత 23 సంవత్సరాలుగా పాదయాత్రగా వెళ్తున్న కార్యక్రమానికి విఘాదం కల్పించారని విచారం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్ణయానికి కట్టుబడకుండా తాను పాదయాత్రగా వెళ్లగలనని అయితే దైవకార్యం కావడం వల్ల ఇష్టం లేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా అన్నమయ్య కాలిబాటలోని పాదయాత్ర చేస్తానని స్పష్టం చేశారు. అయితే అధికారులు అనుమతి ఇవ్వని కారణంగా నేడు జరగనున్న పాదయాత్ర రద్దు చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఒంటిమిట్ట కోదండ రామాలయానికి పాదయాత్రగా వెళుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 09.00 గంటలకు రాజంపేట మండలం ఆకేపాడు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణోత్సవం అనంతరం పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి.

**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 4 ప్రభాత వార్త**



పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69 వర్ధంతి , సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సూపర్డెంట్ సుజాత, ఉప ఖజానా అధికారి తిరుపతి స్వామి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ వరుణ్ కుమార్ రెడ్డి , సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం,ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఒక ప్రముఖ భారతీయ సంఘ సంస్కర్త, న్యాయవేత్త,రాజ్యాంగ రూపశిల్పి,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేశారని ఆయనను బాబాసాహెబ్ అని ప్రేమగా పిలుస్తారు. మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ హనుమంత్ రక్తదానం చేసి అనంతరం మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శమని పొద్దుటూరు పట్టణంలోని యువత బ్లడ్ డొనేషన్ క్యాంపులో పాల్గొనాలన్నారు. ఈ రక్త దాన శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘాలు నాయకులు గుర్రం డేవిడ్ రాజ్, సిఐటియు కార్యదర్శి సాల్మన్, నాయకులు రాఘవ, అంబేద్కర్ సేన సమితి సంపత్, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం మేకల శేఖర్. హ్యూమన్ రైట్స్ వెంకటన్న, విద్యార్థులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మహేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

**నందలూరు, డిసెంబర్ 04 ప్రభాతవార్త:**

మండలంలోని నందలూరు పంచాయతీలో ఓ వైన్ షాప్ సమీపంలో టీవీ పురం గ్రామానికి చెందిన ఎర్రగుళ్ల రోశయ్య (65) మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలవలో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వారి బంధువులకు అప్పగించారు. ఇదే కాలువలో ఇంతకుముందు కూడా ఇద్దరు వ్యక్తులు పడి మృతి చెందిన ఘటనలు చోటు చేసుకోవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

## వీఆర్ఏల సమస్యలు పరిష్కారం కొరకు వినతి

**సిద్ధవటం డిసెంబర్ 4 ప్రభాతవార్త**



వీఆర్ఏల సమస్యల పరిష్కారం కొరకు వీఆర్ఏల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిసెంబర్ 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీఆర్ఏల జిల్లా అధ్యక్షులు వెంకటపతి తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని తాసిల్దార్ ఆకుల తిరుమల బాబుకు గురువారం తమ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సుమారు 19, 359 వేలమంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నారని రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం నుండి చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్నామని, డిపార్ట్మెంట్లో దిగువ స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉన్నావని ఆయా గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి వీఆర్ఏల ప్రధాన పాత్ర పోషిస్తూ గ్రామంలో నివసిస్తూ అనునిత్యం సమస్యలు పరిష్కారంలో ప్రజలకు అందుబాటులో ఉన్నామని వీఆర్ఏలకు పని భారం ఎక్కువైందని గత ప్రభుత్వంలో వీఆర్ఏలకు వేతనాలు పెంచలేదని రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిసెంబర్ 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో వీఆర్ఏల జిల్లా అధ్యక్షులు వెంకటపతి, వీఆర్ఏలు, కిషోర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా గ్రామ కమిటీల ఏర్పాటు

**దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**



వైకాపా పార్టీ ఆదేశాల మేరకు మండలంలో గ్రామ కమిటీల ఏర్పాటుకు సిద్ధం అవుతున్నట్లు మండల వైకాపా కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిన్న సింగనపల్లె గ్రామంలో వైకాపా గ్రామ కమిటీలపై ఆ గ్రామ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగానే వార్డులు, గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకి అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మనాభ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మార్చి చివరి వరకు కేసికు నీరు

**దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త**

కడప జిల్లాకు ప్రధాన నీటి వనరు అయిన కేసీ కాలువకు వచ్చే ఏడాది మార్చి 31 వరకు నీరు వస్తుందని కేసీ కెనాల్ ఏఈ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. నంద్యాలలో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రబి 202526వ సంవత్సరానికి సంబంధించి మార్చి 31 వరకు నీరు ఇచ్చేందుకు ఈ సమావేశంలో తీర్మానించారన్నారు. కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తారని అందువల్ల కేసి రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## తప్పిపోయిన బాలిక - కేసు నమోదు

**కడప క్రైం, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

ఆలంఖాన్‌పల్లెకు చెందిన చిన్న, వైకుంట సుమాంజలి కుమార్తె గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు పై ఫొటోలోని బాలిక పేరు వైకుంట ఆదిలక్ష్మిగా పేర్కొన్నారు. ఎవరైనా ఆచూకి తెలిస్తే 9121100514, 9121100712, 08562 242132 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ప్రజలకు అవగాహన

**రామసముద్రం డిసెంబర్ 4 ప్రభాతవార్త**

మండలం లోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో క్రైమ్, సైబర్ నేరాలపై ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏ ఎస్సై హిమాచలపతి అధ్యక్షతన గురువారం క్రైమ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఏ ఎస్సై మాట్లాడుతూ క్రైమ్, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు గురువారం గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో నేరుగా ముచ్చటించి వివిధ నేరాలపై భద్రత ప్రమాణాలపై గురించి ప్రజలకు క్లుప్తంగా వివరించారు. సైబర్ నేరగాళ్ల ప్రజలను ఎదోవిధంగా మోసాలు చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరచిత వ్యక్తులు కాల్ చేసి మీకు ఓటి పి అడుగుతారని మీరు ఓటిపి నంబర్ చెప్పకండి అని ప్రజలకు తెలియజేసారు. మీకు ఎవ్వరిపైన సందేహం కలిగితే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై హిమాచలపతి, కానిస్టేబుల్ బాలాజీ గ్రామస్థులు కైకాల కుమార్ స్వామి, సందూరి సర్దార్ బాషా, బాబు సాబ్(తారక్) వెంకటలక్ష్మమ్మ, చంద్రశేఖర్ రాజు, నారాయణ గౌడ్,సి. నారాయణ, ఆకుతోట నారాయణ, తిరుపతి నాయుడు, అనిల్ గౌడ్, దివ్యశ్రీ, చిన్ని, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాలతో నిఘా

**కడప క్రైం, డిసెంబరు 4, ప్రభాతవార్త:**



గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వన్ టౌన్ సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో కడప నగరం వన్‌టౌన్ పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. గురువారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

## మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు

**కడప క్రైం, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది గురువారం మహిళా భద్రత(ఉమెన్ సేఫ్టీ)పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో విద్యార్థినిలకు బాలికల రక్షణ, సమాజంలో మహిళల భద్రత, మరియు పోక్సో (పీఓసీఎస్ఓ) చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. బాలికలు ఎదుర్కొంటున్న మానసిక శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. సైబర్ క్రైం, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్‌లైన్ భద్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో జరిగే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వారికి ఉదాహరణలతో వివరించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. డయల్ 100/112(అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ), గృహహింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్

**జమ్మలమడుగు, డిసెంబరు 4, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇద్దరి నిర్ణయం ఒకటేనా ?

### రాజంపేట జిల్లా కేంద్రం చేస్తారా?... ఒక అంకం ముగిసింది



**రాజంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త**

రాజంపేట తెలుగుదేశం అభ్యర్థిని గెలిపిస్తే జిల్లా చేస్తామని స్వయంగా ఎన్నికల సభలో ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే గత నెలలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత రాజంపేటను జిల్లా కేంద్రం చేసే విషయమై ప్రభుత్వం రాజంపేట జిల్లా చేస్తామని ప్రకటించలేదు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మదనపల్లి మాత్రం కొత్త జిల్లా చేస్తామని ప్రకటించింది. ఫలితంగా రాయచోటి,రైల్వే కోడూరు, రాజంపేట మూడు నియోజకవర్గాలు కలిపి రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజంపేట నియోజకవర్గం ప్రజలు రాజంపేటలో జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు శ్రీకారం చుట్టారు. అందుకు రైల్వేకోడూరు నియోజవర్గం కూడా గొంతు కలపడంతో జిల్లా కేంద్రం నినాదం హోరెత్తింది. మూడు రోజుల క్రితం జిల్లా సాధన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీకి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. దీంతో రెండు నియోజకవర్గాల కూటమినేతలు దిక్కు తెలియక ప్రజల భావోద్వేగాలను గమనించి రాజంపేట జిల్లా చేయాలని వారు గళం విప్పారు. జనంతో కలిశారు.జిల్లా సాధన కోసం ఉద్యమానికి తాము సిద్ధమని ప్రకటించారు. ఫలితంగా రాజంపేట జిల్లా కేంద్రం కావడం రెండు నియోజకవర్గాల పరిధిలోని కూటమినేతలకు సవాల్గా మారింది. అటు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ,కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, రైల్వే కోడూరు టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి నియోజకవర్గంలో తమ పరిస్థితిని ప్రజల మనోభావాలను వివరిస్తూ అటు ముఖ్యమంత్రి ,ఇటు ఉప ముఖ్యమంత్రి కి వినతి పత్రం అందజేశారు. మరోవైపు గురువారం రాజంపేటకు వచ్చిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు కలిసి రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని వినతి పత్రం అందజేశారు.నీతో ఒక అంకం ముగిసింది. ఎందుకంటే ఎన్నికల సందర్భంగా రాజంపేట జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించిన ఇద్దరు సీఎం ,డిప్యూటీ సీఎం గా ఉన్న నేపథ్యంలో వారిరువురికి కూటమి నేతలు వినతిపత్రం అందజేయడంతో అంకం ముగిసినట్టుగా చెప్పవచ్చు. కాదంటే సీఎం చంద్రబాబు నాయుడు రాజంపేట సభలో మాత్రం రాజంపేటలో ప్రజలు తమకు ఓటు వేయలేదని, రాయచోట్లో గెలిపించారని, గెలిపించిన వారికి న్యాయం చేయాలా? ఓడించిన వారికి న్యాయం చేయాలా చెప్పాలని వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో రైల్వే కోడూరు నియోజకవర్గంలో జనసేన అత్యధిక మెజార్టీతో విజయం సాధించింది .దీంతో అక్కడ కూటమినేతలకు జిల్లా కేంద్రం చేయకపోతే తమ పరిస్థితి ఏంటని డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల భావోద్వేగాలను అటు సీఎం, డిప్యూటీ సీఎం విన్న నేపథ్యంలో ఇద్దరు ఈ విషయమై చర్చిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిన విషయం.


**GOVERNMENT OF ANDHRA PRADESH**

**MUNICIPAL ADMINISTRATION DEPARTMENT**

**BADVEL MUNICIPALITY**

| Sl. No. | e-Procurement Notice | Name of Grant | Number of Works | Estimate Contract Value (in Lakhs) |
|---|---|---|---|---|
| 1 | 107 to 108/2025-26/E1 | BPS-2019 & LRS-2020 FUNDS | 02 | 221.21 |
| 2 | 109 to 110/2025-26/E1 | KUDA FUNDS | 02 | 50.56 |
| 3 | 111 to 122/2025-26/E1 | 15 FCG | 12 | 159.61 |
| 4 | 123 to 133/2025-26/E1 | GENERAL FUND | 11 | 60.57 |
| 5 | 134 /2025-26/E1 | SC/ST Sub Plan Grants | 01 | 7.18 |
| | TOTAL | | 28 | 499.13 |

Bid document download start Date & time 09.12.2025 05.00 PM
Bid document download End Date & time 23.12.2025 05.00 PM
Bid submission closing Date & time 23.12.2025 05.30 PM

The Contractors who are awarded the work previously through e-procurement tender process and not started the works are not eligible and their participation in this tender notice will be rejected & All rights are reserved to the commissioner to cancel or reject the tenders without assigning any reasons and there of

Contact: Further details can be seen @e-procurement market place at https://www.tender.apeprocurement.gov.in contact: Deputy Executive Engineer (8179611207). Commissioner (9959555838)

*Commissioner*
*BADVEL MUNICIPALITY*

## అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలి



బద్వేలు, డిసెంబర్ 4, ప్రభాతవార్త

ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిలో నియమించబోయే అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను ప్రతి పాఠశాలలో నియమించాలని ఎన్‌టిఏ నాయకులు రవిశంకర్ ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గత ఏడాది బదిలీలలో స్థానచలనం పొంది రిలీవర్ రాకపోవడంతో చాలామంది ఉపాధ్యాయులు కొత్త పాఠశాలలో చేరలేక పోయారన్నారు. కావున రిలీవర్ రాక బదిలీ కానీ ఉపాధ్యాయులందరి స్థానంలో అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించి వారిని రిలీవ్ చేయాలని కోరారు. అలాగే హై స్కూల్ ప్లస్ లో ఉన్న ఖాళీలను కూడా వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం

తొండూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త :

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశము 5వ తేదీన శుక్రవారం జరుగుచున్నది. కళాశాలలో జరగబోయే తల్లిదండ్రుల సమావేశమునకు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్‌రావు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో అధ్యాపకులతో చదువు, మధ్యాహ్న భోజన పథకం, ఇతర విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వెంకటసుబ్బారెడ్డి



బద్వేలు అర్బన్, డిసెంబర్ 4, ప్రభాతవార్త

అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బద్వేల్ మండలం ఎత్తి రాజు పల్లె గ్రామానికి చెందిన నాగేళ్ళ వెంకటసుబ్బారెడ్డిని రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్మోహన్ రెడ్డి నియమించడం జరిగిందన్నారు. గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టుగా, పనిచేస్తూ రెడ్డి సంఘంలో పనిచేసిన అనుభవం దృష్ట్యా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ నా పైన నమ్మకంతో అప్పగించిన పదవి బాధ్యతను అఖిలభారత రెడ్డి సంఘం అభివృద్ధికి పాటుపడతానని అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రెడ్డి జాతీయ అభివృద్ధికి కృషి చేస్తానని అదేవిధంగా నాపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ భూపాల్‌రెడ్డికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సోదరి పొన్నపురెడ్డి శకుంతలరెడ్డికి, ధన్యవాదాలు, మరియు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## యరమల పల్లెలో NSS కార్యక్రమం




వీరపునాయునిపల్లి డిసెంబర్ 04 ప్రభతవార్త :

వీరపునాయినిపల్లెలోని VRS డిగ్రీ కళాశాల విద్యార్థులచే ఎర్రమల పల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ కోఆ ర్డినేటర్ వేమ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో చెత్త కలుపు మొక్కలను తీసివేసే గుడిని శుభ్రం చేసి ఉంచారు ఈ కార్యక్రమము ఈ నెల నాలుగో తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈ స్పెషల్ క్యాంపును ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్‌జు సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కురబలకోట, డిసెంబర్ 4 ప్రభాతవార్త



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని కుర్రబలకోట భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. దివ్యాంగుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి గంగయ్య కోరారు. కురబలకోట భవితా కేంద్రంలో పద్మజ ఆధ్వర్యంలో పిల్లలకు విద్యతో పాటు అనేక నైపుణ్యాలను కలిగిస్తారని, దివ్యాంగులకు అనుకూలంగా ఉండే ట్రై సైకిళ్లను, వినికిడి యంత్రాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ భవిత కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గంగయ్య ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, భవిత కేంద్ర టీచర్ పద్మజ, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

రామసముద్రం డిసెంబర్ 4 ప్రభాతవార్త




మండల కేంద్రంలోని దిగువపేటలోని ప్రభుత్వ తూర్పుపాఠశాలలో హెచ్‌ఎం హేమలత ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంఈఓ హేమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో దివ్యాంగులను కూడ బాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. దివ్యాంగులకు ఏపి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరిస్తోందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంఈఓ హేమలత, హెచ్‌ఎం హేమలత, భాస్కర్ నారాయణ స్వామి, జాన్ బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తుల కోసం వేధిస్తున్నారు

మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 4 ప్రభాతవార్త



తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం కోడలు మనవరాళ్లు వేధింపులకు గురి చేస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మలు అవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మలు మాట్లాడుతూ తమకు ముగ్గురు పిల్లలు సుధాకర్, సురేష్‌కుమార్, కుమార్తె ఉన్నారన్నారు. అయితే సుధాకర్ వివాహం కాకనే చనిపోయాడని, సురేష్ కుమార్‌కు భార్య మంజుల, ముగ్గురు కుమార్తెలు మానస, పావని నవ్యశ్రీ ఉన్నారన్నారు. ఏడాది క్రితం సురేష్ కుమార్ సైతం మృతి చెందాడన్నారు. అప్పటినుంచి కోడలు, మనవరాళ్లు ఆస్తుల కోసం పాకులాడుతున్నారే తప్ప మా బాగోగులు చూడడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఆస్తులు రాసిచ్చేయాలని తమను వేధింపులకు గురిచేస్తూ అవమాన పరుస్తున్నారన్నారు. అధికారులు స్పందించి మాకు కోడలు, మనవరాళ్ల నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం డిశంబర్ 04 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు.ఎంపీటీసీ సభ్యులు, జడ్‌పిటిసి సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు అన్ని శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అలాగే అధికారులు వారి వారి ప్రగతికి సంబంధించిన వివరాలను తీసుకొని సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

## పద్మశ్రీ ఘంటసాల 103 వ జయంతి

బద్వేల్ అర్బన్ డిసెంబర్ 04 ప్రభాతవార్త :



పద్మశ్రీ ఘంటసాల 103 వ జయంతి కార్యక్రమం స్థానిక సంగీత సేవా సంస్థ పద్మశ్రీ ఘంటసాల లలిత కళా పరిషత్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులతో పాటు గానుగపెంట నర్సింహులు, సంగీత విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు యస్.యస్. దావూద్, కోశాధికారి రూపరాజు ఉమామహేశ్వరరావులు మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల చిరస్మరణీయ గాన ప్రతిభాశాలి అత్యంత అరుదైన సంగీత బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఘంటసాలకి సరియైన గుర్తింపును ఇస్తూ ఆ మహానుభావునికి "భారతరత్న" పురస్కారం ప్రకటించడం ఎంతైనా సముచితమని కేంద్ర ప్రభుత్వంను కోరారు.

## ఎస్ఐగా హుస్సేన్ బాధ్యతల స్వీకరణ

సుండుపల్లె, డిసెంబర్ 04,ప్రభాతవార్త :

సుండుపల్లి పోలీస్ స్టేషన్‌కు సబ్‌ఇన్స్పెక్టర్గా కొత్తగా నియమితులైన ఎస్.కె.యం. హుస్సేన్ గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించరు. ప్రజా సేవలో అంకితభావం, క్రమశిక్షణ, నేరాలపై కఠిన విధానంతో పని చేసే అధికారిగా హుస్సేన్ ఇప్పటికే మంచి గుర్తింపు సాధించారు. మండలంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా పోలీస్ సేవలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

పెనగలూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండలం ఎన్‌ఆర్ పురం వరద బాధితులకు పంట నష్టపరిహారం అందిండి రైతులను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య కామ్రేడ్ మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ పరిశీలించారు. అకాల వర్షాల వల్ల వంట నష్టం జరిగిన బాధితులకు ప్రభుత్వం ఇప్పటివరకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్రను మేలుకొని పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, శంకరయ్య, సుబ్రహ్మణ్యం, నరసింహులు సిద్ధం నరసింహులు పెంచలమ్మ నరసింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

పెనగలూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో యుటిఎఫ్ స్వచ్ఛంద సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరించి యుటిఎఫ్ సంఘానికి విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఎల్లప్పుడూ ముందు వరసలో వుండి పోరాటం సాగిస్తోందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. హరి ప్రసాద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను మిగులుగా మార్చి ప్రాథమిక పాఠశాల హెచ్‌యం, క్లస్టర్ ఉపాధ్యాయులుగా రూపాంతరీకరణ చేయడం తగదన్నారు. బోధనేతర కార్యక్రమాలలో ఉపాధ్యాయులను నిరంతరం భాగస్వాములను చేస్తూ బోధనకు దూరం చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను నిర్వహించాలనుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్వర్ బాష, మహేంద్ర, సుదర్శనం, శివ నరసింహులు, ప్రసాద్,వెంకట రెడ్డి, క్రిష్ణకుమారి, ప్రమీల, శ్రీవాణి, పరిమళ, దేవమణి, శ్రీదేవి, షబాన పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల 103వ జయంతి

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 04, ప్రభాత వార్త



పద్మశ్రీ ఘంటసాల వెంకరేశ్వరరావు 103 వ జయంతిని నిర్వహించారు. కళాకారుల ఆధ్వర్యంలో రంగస్థల నటుడు యలంకూరి రాజేంద్ర ప్రసాద్ పాల్గొని ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆణి ముత్యాలు లాంటి ఎన్నో పాటలతో ప్రేక్షకులను రంజింపచేసిన గొప్ప గానగాంధర్వుడు ఘంటసాల అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ హార్మోనిస్ట్ మహాదేవ రామాంజనేయులు చెక్క భజన గురువు ఆదినారాయణ శంకరయ్య, అశోక్ కుమార్, rtd టీచర్ సుబ్రహ్మణ్యం రమణ, విజయభాస్కర్ నాయుడు, రమణయ్య మొదలగువారు పాల్గొని నివాళులు అర్పించారు.

## పౌర్ణమి సందర్భంగా అన్నప్రసాదం

ప్రొద్దుటూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త



బీసీ నాయకులు మరియు టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజ గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా గురువారం స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని చిన్నమ్మ తల్లి పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస యాదవ్ ప్రసాద్ బంగి శివ జయచంద్ర యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

### న్యాయమూర్తి జస్టిస్ అమర్ ఫరూక్.

తంబళ్లపల్లె డిసెంబర్ 4 ప్రభాతవార్త ః

దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ సూచించారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి దివ్యాంగుల చేత కేక్ కట్ చేయించి పంచిపెట్టి వారిని మనసారా ఆశీర్వదించారు. దివ్యాంగులు ఎందులో తక్కువ కాదని వారిలో విద్యతోపాటు మానసిక ఉల్లాసం, శారీరిక దృఢత్వం పెంపొంది అన్ని రంగాలలో అభివృద్ధి వైపు నడవాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల పై వివక్ష చూపరాదని వారిని ప్రతి ఒక్కరు అందరితో సమానంగా ఆదరించాలని సూచించారు. అనంతరం పలు రకాల పోటీలలో రాణించిన దివ్యాంగులకు న్యాయమూర్తి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు, టీచర్ సాంబశివ, ఐఈఆర్టీ టీచర్లు రేఖ , శ్రావణి, ఫిజియోథెరపీ సరళ, ఎంఆర్పి సుధాకర్, కేర్ టేకర్ నాగరత్నమ్మ, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో ఆహారం పంపిణీ

ప్రొద్దుటూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త



మండల పరిధిలోని గౌతమి మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఏడు రోజుల ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా 4వ రోజు వృద్ధాశ్రమంలో ఆహారాన్ని అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తమ సేవా భావాన్ని చాటుతూ వృద్ధులను ఆదరించడం వారి సమస్యలు తెలుసుకుని అవసరమైన సహాయాన్ని అందించడం ప్రతి విద్యార్థి బాధ్యతగా తమ విధులను నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి కో డైరెక్టర్ శైలూష డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష రావు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ స్వరూప్ ఎమ్మెస్సార్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు సింధుజ శ్రీనివాసులు వివిధ విభాగ అధిపతులు జాబీర్ అలీ సుకుమార్ విజయమ్మ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

గాలివీడు, డిసెంబర్ 4(ప్రభాతవార్త):



చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని లక్కిరెడ్డిపల్లి సీఐ టీవీ కొండారెడ్డి గ్రామ ప్రజలకు సూచించారు. గురువారం గోరాన్‌చెరువు గ్రామ సచివాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల్లో జాగృతి పెంపుదల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, మహిళలపై దాడులు, సైబర్ నేరాలు వంటి సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని, గ్రామాభివృద్ధికి శాంతి, భద్రతలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీసిఎంని కలిసిన న్యాయవాది ఆనంద్

మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర యాదవసంఘం అధ్యక్షులు, న్యాయవాది తుర్ల ఆనంద్‌యాదవ్ కలిశారు. గురువారం తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారికి అండగా నిలుస్తానని మాజీ ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. 2029 ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి రావడం ఖాయమని తెలపడం జరిగిందన్నారు. ముఖ్యంగా న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

### బివైఎస్ నాయకులు ఫిర్యాదు

మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మున్సిపాలిటి పరిధిలోని బఫర్‌జోన్‌ల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన నాయకులు ఫిర్యాదు చేశారు. గురువారం రాష్ట్ర అసిస్టెంట్ కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్టేటన్ కార్యాలయంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునిత్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం కోమిటివానిచెరువు బఫర్ జోన్, నీటికాలువను ఆక్రమించుకొని జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించే ఈఅక్రమ నిర్మాణాలను తక్షణం కూల్చివేయాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా వాజ్‌పాయి విగ్రహ శంకుస్థాపన

మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న దృశ్యం

పట్టణ సమీపంలోని అన్నమయ్య సర్కిల్‌లో గురువారం మాజీ ప్రధాని, దివంగతనేత అటల్‌బిహారి వాజ్‌పాయి విగ్రహ శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ ఆధ్వర్యంలో విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పాయి విగ్రహన్ని మదనపల్లెలో ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి వాజ్‌పాయి ఎంతో సేవ చేశారన్నారు. ఈనెల 14న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరేంద్రకుమార్‌రెడ్డి, విజయ భారతిస్కూల్ డాక్టర్ సేతు, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, క్రిష్ణయ్యవర్మ, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓసూరి కిరణ్‌కుమార్, జబ్బల శ్రీనివాసులు, బర్నేపల్లి రవికుమార్, బండిఆనంద్, భువనేశ్వరిసత్యా, పిల్లస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

పీలేరు డిసెంబర్ 4 ప్రభాతవార్త:



మాట్లాడుతున్న పాలకొండ శ్రీనివాసులు

భారతీయ అంబేద్కర్ సేన బాస్ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సందర్భంగా 20, 21 వ తేదీన విజయవాడ కేంద్రంగా జరిగే బాస్ రాష్ట్ర మహాసభలకు బాస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నేడు పీలేరులో స్థానిక బాస్ కార్యాలయం నందు బాస్ నాయకులు గుండ్లూరు రవీంద్ర అధ్యక్షతన జరిగిన బాస్ ముఖ్య నాయకుల సమావేశానికి బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు రాష్ట్ర మహాసభల విషయంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ మహనీయుడు స్వప్నించిన కుల నిర్మూలన స్టేట్ సోషలిజం సాధించడానికి, బౌద్ధ సాంస్కృతిక జీవనం రాజ్యాధికారం లక్ష్యంగా అంబేద్కర్ సేన ఆవిర్భవించిందని, దేశానికి జాతీయ గీతాన్ని అందించిన మదనపల్లిలో పురుడు పోసుకున్న భారతీయ అంబేద్కర్ సేన ఆనాటి నుంచి నేటి వరకు అంచెలంచలుగా ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ఎర్రబల్లి మల్లికార్జున, గుండ్లూరు రవీంద్ర, దప్పేపల్లి ఆనంద్ కుమార్,పల్లె పోగు హరినాథ్, జనార్ధన్, రాజేంద్ర నాయక్, సురేష్ నాయక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ముద్దాయి అరెస్టు రిమాండ్ కు తరలింపు.

చిట్వేలి, డిసెంబర్ 4,ప్రభాతవార్త:

స్థానిక మండల పరిధిలోని నాగవరం గ్రామంలో బుధవారం నమోదైన హత్యాయత్నం కేసులో ముద్దాయి జగదాభి ప్రసాద్ రాజు (38) తండ్రి లేట్ నాగరాజు ను సీఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు స్థానిక ఏఎస్ఐ వెంగయ్య తెలిపారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యకే ప్రాధాన్యం

### పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు డిసెంబర్ 4 ప్రభాతవార్త:



ఎమ్మెల్యేని సత్కరించిన ఉపాధ్యాయులు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికే కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఉమ్మడి పరీక్షా మండలి (డిసిఈబి) కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పీలేరు మండలం, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటిపర్తి గంగాధరం గురువారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువులు సమాజ నిర్మాణంలో కీలకమైన మూల స్తంభాలని, విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. అనంతరం డిసిఈబి నూతన కార్యదర్శి తాటిపర్తి గంగాధరం మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక నియామకం కోసం సహకరించిన పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కోశాధికారి వై.వి. రమణ, ప్రధానోపాధ్యాయులు బి. వేణుగోపాల్ రెడ్డి, రెడ్డప్ప, అలాగే జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోధన సిబ్బంది రామ్మూర్తి, అశోక్ కుమార్, సురేంద్రనాథ్, ఫారుఖ్, ఆనందరాజు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఆరాధన మహోత్సవాలు

పోరుమామిళ్ల రూరల్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:

కాశి నాయన మండలం వరికుంట్ల పై భాగాన నల్లమల్ల అడవిలో శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన 30వ ఆరాధన మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 4,5వ తేదీలలో జరిగే ఆరాధన మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు నిత్యం అన్నదానం చేస్తూ ఎటువంటి ఘటనలు జరగకుండా ఆలయ నిర్వాహకులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. గురువారం మొదటి రోజు కావడంతో వైయస్ఆర్సీపీ బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి కాశిరెడ్డి నాయనను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. భజన,కోలాటం డ్రామా,మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వచ్చేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

## సిఆర్‌ఎంటిల సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు, డిసెంబర్ 4 ప్రభాతవార్త:

పనికి తగిన వేతనం అందక చాలీచాలని జీతాలతో ఏ ఊరు లో ఇబ్బందులు పడుతున్న క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ (సిఆర్‌ఎంటి) సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఆర్‌ఎంటి లు చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం కలసపాడులోని ఎంఈఓ ఆఫీసు దగ్గర ఉపాధ్యాయ సంఘ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఎంఈఓ లకు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు మరియు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్య వారధిగా ఉండి అనేక రకాలుగా సహకరిస్తూ, విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న సిఆర్‌ఎంటిల సమస్యల పరిష్కారంలో మాత్రం ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం సరికాదన్నారు. వారి ప్రధానమైన సమస్యలైన విలీనమైన క్లస్టర్లలోనే కొనసాగించాలని, ఖాళీగా ఉన్న సిఆర్‌ఎంటి పోస్టులను భర్తీ చేసి పని భారాన్ని తగ్గించాలని, 9 సంవత్సరాలుగా పెరుగుదల లేకుండా ఉన్న వేతనాలను తక్షణమే పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎంటిలు జోహార్ తాజ్, మధుసూదన్ రావు, ఓబయ్య పాల్గొన్నారు.

## పేద రోగులకు ఉలన్ రగ్గుల వితరణ

కేవిపల్లి డిసెంబర్ 4 ప్రభాతవార్త:



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గురువారం పీలేరు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు చింతల రామ చంద్రారెడ్డి వాల్మీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చలికాలంలో రోగులు కప్పుకోవడానికి స్థానిక సత్యసాయి సేవ సమితి మరియు సత్యసాయి భక్తులు అందచేసిన ఉలన్ రగ్గులను ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెంట్ మాలతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సోని, హెడ్ నర్స్ సుమంగళి, రిటైర్డ్ ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, చింతల ఆనంద రెడ్డి, నీళ్ల భాస్కర ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కాశిరెడ్డి నాయన ఆరాధన

రాజుపాళెం, డిసెంబర్ 04, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో గల శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన ఆలయంలో గురువారం స్వామివారి ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో ఇతర గ్రామాలకు చెందిన స్వామి వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అడ్వకేట్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

### :బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి

బద్వేలు, డిసెంబర్4 (ప్రభాతవార్త):

పేదల సొంత ఇంటికలను త్వరిత గతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హౌసింగ్ నిర్మాణాలను పీడీతో కలిసి పరిశీలించారు.నిర్మాణాల పురోగతి మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 1.0 క్రింద మంజూరైన 5,600 ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ప్రస్తుతం కొన్ని ఇళ్లు పనులు బేసుమట్టం దశలో మరికొన్ని గోడల వరకు ఇంకొన్ని స్లాబుల పరిధిలో పూర్తి కావడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని గుర్తుచేస్తూ ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి రూ.23కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన, 2.0కింద స్వంత భూమి కలిగి ఉన్నవారికి మంజూరైన 1200 ఇళ్లు నిర్మాణం త్వరగా ప్రారంభం కావడానికి వారికి పొజిషన్ సర్టిఫికేట్ అందించాలని హౌసింగ్ డిఈకి సూచించారు. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఈ సమీక్షలో పాల్గొని పేదలకు ఇచ్చే ఇల్లు పంపిణీపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పనులు త్వరగా పూర్తి చేసి త్వరలోనే ఇళ్లను వారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజారాం, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెంగళరెడ్డి, ఎల్ఎస్పీ డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు




**గాలివీడు, డిసెంబర్ 4(ప్రభాతవార్త):**
మండలంలోని ఆవులశెట్టివారిపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాల దుస్థితి విద్యార్థులను, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొద్దిపాటి వర్షం పడినా మొత్తంలో తరగతి గది, వరండా పూర్తిగా తడిసి నీటితో ముద్దవుతోంది. పిల్లలు పుస్తకాల సంచులు తడవకుండా టేబుళ్ల కింద పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైకప్పు ఎక్కడికక్కడ పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు కూర్చోవడం సైతం కష్టతరంగా మారి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవలే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాఠశాల భవనాన్ని తనిఖీ నిర్వహించి పాఠశాల పూర్తి స్థాయిలో జీర్ణించిపోయి, ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితిలో ఉందని నివేదిక సమర్పించినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలగా నడుస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే అందరికీ కలిపి ఒకే తరగతి గది ఉండటం పైకప్పు పెచ్చులూడుతుండటంతో బోధనకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతోందని ఉపాధ్యాయులు వెల్లడించారు. ఈ పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పటికీ మౌలిక వసతుల లేమితో పాఠశాల కార్యకలాపాలు అంతరాయానికి గురవుతున్నాయి. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు పనిచేయడం పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తూనే పాఠశాల భవన దుస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా వెంటనే భవన మరమ్మతులు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**ఆందోళన కలిగిస్తోంది**



పాఠశాల పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో అని ఆందోళన కలిగిస్తోంది. వర్షం కురిస్తే చాలు తరగతి గది, వరండా పూర్తిగా తడిసిపోతోంది. పైకప్పు పెచ్చులూడి అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ రోజులు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- జి.వెంకట్రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

## విభిన్న ప్రతిభావంతుల్లో వెలుగే ముఖ్యం

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, డిసెంబర్ 4 ప్రభాతవార్త :**
విభిన్న ప్రతిభావంతుల్లో వెలుగు ముఖ్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో గురువారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంతో మంది దివ్యాంగులకు ఆశ్రమం కల్పిస్తున్న వెలుగు సంస్థకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వెలుగు సంస్థకు ఎలాంటి సాయం కావాలన్నా చేస్తానని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రతి చిన్నారి మొఖంలో తెలియని వెలుగు ఉందని, అదే వీరు బయట ఉంటే వారిని చూడడానికి కూడా చాలా నిసహృతో ఉంటారని తెలిపారు. వెలుగు సంస్థ దివ్యాంగులు, వృద్ధుల జీవితాల్లో వెలుగు నింపుతున్న సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డిని అభినందించారు. అనంతరం వెలుగు బధిరులకు హీరింగ్ హెడ్స్, శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు వీల్‌చైర్స్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఆటలపోటీల్లో గెలుపొందిన చిన్నారుకులు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి, ట్రెజరరల్ రఘునాథ్‌రెడ్డి, సూపరిండెంట్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఈసి మెంబర్ సుజాత, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటి, సోషల్ వర్కర్ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**



**ప్రొద్దుటూరు డిసెంబర్ 4 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కారం చేసే దిశగా ప్రజా దర్బార్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజల సమస్యలను వారి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారని ప్రజా సమస్యల పరిష్కారానికి తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ప్రజల నుండి తెలుసుకున్న సమస్యలను వారి విజ్ఞప్తులను సంబంధిత అధికారులకు హోం ద్వారా తెలియజేసి తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. భవిష్యత్తులో తాను ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ మరియు టిడిపి నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**రాజంపేట, డిసెంబర్4 ప్రభాతవార్త**
జిల్లాలోని ప్రతి డివిజన్లో డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం రాజంపేటలోని బోయినపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, రాజంపేట టిడిపి ఇన్చార్జి జగన్మోహన్‌రాజు, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1973లో ప్రారంభమైన పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామాలు, మండలాల అభివృద్ధికి కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ తీసుకొచ్చిన ఈ వ్యవస్థీకృత మార్పుతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా రాజంపేట టిడిపి ఇన్చార్జి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుందని, డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో గ్రామాలు మండలాలు మరింత అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, డిపిఓ రాధమ్మ, రాజంపేట తాసిల్దారు పీర్ మున్ని, జనసేన నియోజకవర్గం నేత ఎల్లటూరి శ్రీనివాసరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,టిడిపి నేత ఎస్ వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు పాలిటెక్నిక్‌లో విజయోత్సాహం

**- పూర్వ విద్యార్థులు రైల్వే జేఈ ఉద్యోగాలకు ఎంపిక**



**ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 4, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు చెందిన 2021 ఏడాది పూర్వ విద్యార్థులు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన డిప్లమో ఆధారిత జూనియర్ ఇంజినీర్ (జేఈ) పరీక్షలో విజయవంతమై ఉద్యోగాలు సాధించిన సంఘటన కళాశాలకు మరో ప్రతిష్టను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో ప్రత్యేక అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులైన మస్తాన్‌వల్లి (ఈఈఈ), మహ్మద్ గౌస్ (మెకానికల్), చౌడయ్య(ఈఈఈ), తులసి(ఈఈఈ) రైల్వేలో జేఈ హోదాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనరచడం వల్ల కళాశాల గర్వించదగిన స్థాయికి చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపల్ గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యార్థుల విజయాలు మా కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనం. ఇలాంటి విజయాలు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే దీప స్తంభాలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగాధిపతి మంజునాథ, మెకానికల్ ఇంజినీరింగ్ లెక్చరర్ శివారెడ్డి, ఇతర అధ్యాపకులు, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## డీడీఓ కార్యాలయం ప్రారంభం



**పులివెందుల,డిసెంబర్ 4 , ప్రభాతవార్త :**
పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని మినీ సెక్రటరియేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీఓ) నూతన కార్యాలయాన్ని గురువారంనాడు పశ్చిమ రాయలసీమ జండాల పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి ఆఫీసులోకి ప్రవేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం కోసం మరియు ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా ఈ కార్యాలయం ఉపయోగప డుతుందని తెలిపారు. డివిజనల్ స్థాయి అభివృద్ధి పనుల పర్యవేక్షణ ఇకపై మరింత సులభతరం అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర మార్క్ ఫైడ్ డైరెక్టర్ వంగల శశిభూషన్ రెడ్డి గారు కూటమి నాయకులు, కార్యకర్తలు ఆర్డీవో చిన్నయ్య, రెవిన్యూ అధికారులు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిచెన్ పనులను పరిశీలించిన ఆర్డీఓ



**కాశినాయన డిసెంబర్ 4 ప్రభాతవార్త:**
పోరుమామిళ్ల పరిధిలోని స్మార్ట్ కిచెన్ పనులను బద్వేల్ రెవిన్యూ డివిజనల్ అధికారి తి. చంద్రమోహన్ పరిశీలించారు పోరుమామిళ్ల పరిధిలోని బి.కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు మరియు SAKN మండలాల్లో నిర్మాణంలో ఉన్న స్మార్ట్ కిచెన్ పనులను పరిశీలించి వాటి నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏజెన్సీ వారికి తగు సూచనలు చేసి ఈ నెల చివరికి అన్ని స్మార్ట్ కిచెన్లు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయడం అయింది. ఈ కార్యక్రమంలో సదరు తెలిపిన 4 మండలాల తాసిల్దారులు, పంచాయతీరాజ్ ఏఈలు, ఎంఈఓలు, ఎంపీడీవోలు, వారి సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం



**బద్వేలు, డిసెంబర్4 (ప్రభాతవార్త):**
పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్రంలో దాదాపు 70కిపైగా డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించిన నేపథ్యంలో బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ డిడివో కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు మండలస్థాయిలో పరిష్కారం కాని సమస్యలకు డివిజన్ స్థాయిలో త్వరిత గతిన పరిష్కారం లభించేందుకు ఈ కార్యాలయం కీలకంగా మారుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ తీసుకువచ్చిన ఈ సంస్కరణ మరింత సేవ చేస్తుందనే నమ్మకం ఉందన్నారు. గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో ఈ విప్లవాత్మక చర్యలను పవన్‌కళ్యాణ్‌కు పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీకీ, కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ డివిజన్ అభివృద్ధి కార్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక సహకారం అందించిన జిల్లా నీటి నిర్వహణ సంస్త ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నేటినుంచి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించుకునేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అభివృద్ధి అధికారి శేషయ్య, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మైథిలి, బద్వేలు మండల అభివృద్ధి అదికారి మల్లేశ్వరి, డివిజన్ పరిధిలోని మండల అభివృద్ధి అధికారులు, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా దత్తజయంతి వేడుకలు

**: విశేష సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు**



**బద్వేలు అర్బన్ , డిసెంబర్ 4(ప్రభాత వార్త):**
బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసి ఉన్న అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి దేవాలయంలో గురువారం దత్తజయంతి పర్వదినం పురస్కరించుకుని ఆలయ కమిటి అధ్యక్షులు లక్ష్మినరసమ్మ, యానాదిరెడ్డి, శారదల ఆద్వర్యంలో ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ, శ్రీనివాస్‌శర్మల మంత్రోచ్చరణలమధ్య స్వామివారికి తెల్లవారుజామునుంచే అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.అనంతరం అనఘాదేవి దత్తాత్రేయ స్వామి వ్రత మహోత్సవాన్ని నిర్వహించారు. దత్తజయంతిని పురస్కరించుకుని పట్టణంలోని భక్తాదులందరూ స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. స్వామివారికి వివిధ రకాల పూలతో చేపట్టిన అలంకారం భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు ఆలయ కమిటి వారు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించారు.

## భక్తి శ్రద్ధలతో కల్యాణ మహోత్సవం



**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**
స్థానిక వైఎంఆర్ కాలనీలోని అవధూత దత్త పీఠం వారి సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో గురువారం దత్తాత్రేయ స్వామి వారి జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. అదేవిధంగా స్థానిక శివాలయం సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం శ్రీపాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదిక పై ఆశీనులను చేశారు. సుహుహూర్తంలో వేదపండితుల మంత్రోచ్చారణలు. మంగళ వాయిద్యాల మధ్య ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు దత్తాత్రేయస్వామి మహిమలను ఆయన పూజించడం వల్ల కలిగే శుభాలను వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి స్వామి, అమ్మవారిని భిభక్తిశ్రద్ధలతో పూజించారు. డిస్కో రమణ ఆధ్వర్యంలో భక్తిగీతాలకు కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఏర్పాట్లను శ్రీపాదవల్లభసేవా సంఘం అధ్యక్షుడు చింతకుంట జయచంద్ర, సభ్యులు, భక్తులు పర్యవేక్షించారు.

## భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

**దువ్వూరు, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన దువ్వూరులోనూ చుట్టుప్రక్కల గ్రామాలలోనూ గురువారం ఉదయం కురిసిన వర్షంతో మండలంలో వరి పంట నేలకు ఒరిగింది. అలాగే ఇటీవల సాగు చేసిన వివిధ రకాల పంటలు మొలకెత్తి దశలో నీల్లు నిలబడటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. గురువారం ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు ఏకధాటిగా మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో ముఖ్యంగా వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. గింజ దశలో ఉన్న వరి పంట బరువు తట్టుకోలేక కింద పడిపోయింది. అలాగే పూర్తిగా కోత దశకు వచ్చిన వరి పంట కోసే సమయంలో వర్షం రావడంతో దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. ఇటీవల మండలంలో వేరుశనగ, శనగ, మొక్కజొన్న, జొన్న వంటి పంటలు సాగు చేశారు. ఆ పంటలు మొలకెత్తే దశలో ఉండగానే వర్షం రావడంతో దానిపై ప్రభావం చూపుతుంది. అలాగే కేపీ ఉల్లి పంటకు ఈ వర్షంతో తెగుళ్ల ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనా తుఫాన్ ప్రభావం చివర్లో మండలంలో భారీ వర్షం రావడంతో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని చెప్పవచ్చు.

## త్వరలో బద్వేల్ నుండి అయోధ్య వరకు పాదయాత్ర

**బద్వేలు అర్బన్, డిసెంబర్ 4 ,ప్రభాతవార్త**



అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి భవ్య రామ మందిర నిర్మాణం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా శ్రీరాముని విజయోత్సవంలో భాగంగా బద్వేల్ నుండి అయోధ్య వరకు పాదయాత్రను బద్వేలు హరిహర శ్రీరామ సేవా సమితి ప్రారంభించనున్నట్లు పత్తిపాటి నరసింహులు తెలిపారు. అయోధ్య శ్రీ బాల రాముని నిత్య శోభాయాత్ర కోసం 3 అడుగుల శ్రీ బాలరాముని పంచలోహం విగ్రహం, పాదుకలు, రథ ముతయారు చేపిస్తున్నామనీ. శ్రీ బాల రాముని దివ్య మంగళ రూపం కలిగిన విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ కనులారా చూసేలా మరియు సహస్రాలతో చెంబు నీళ్లతో అభిషేకం చేసే విధంగా 108 రోజులపాటు బద్వేల్ మరియు చుట్టుపక్కల గ్రామాలలోని 108 దేవాలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తదుపరి బద్వేల్ నుండి అయోధ్య వరకు పాదయాత్రగా బయలుదేరునన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామకోటి పుస్తకాలు రాసిన వారు ఉంటే మాకు అందజేయగలరన్నారు. మరియు ఎవరైనా రామకోటి రాయాలి అనుకునేవారు ఉంటే జనవరి లోపు మాకు తెలియజేయండి వారికి మేము రామకోటి పుస్తకాలు అందజేయగలమనీ దేవునికి సంబంధించిన పంచలోహ విగ్రహం, పాదుకలు, రథం కొరకు చందాల రూపంలో నగదును సేకరిస్తున్నామన్నారు. ( ఇతర కార్యక్రమాలు ఎవరి వ్యక్తిగతం వారిది) మీ పేరు మీద చందా ఇవ్వతలచిన వారు ఉంటే మాకు తెలియజేయగలరు.చందా చెల్లించిన వారు రసీదు తప్పనిసరిగా తీసుకోవలెననీ. వివరాల కొరకు 7993177477ను సంప్రదించాలన్నారు

## కోదండ రామస్వామి పౌర్ణమి కళ్యాణం

**ఒంటిమిట్ట డిసెంబర్ 04( ప్రభాతవార్త**
రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలం ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో గురువారం మార్గశిర మాస పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు టీటీడీ పర్యవేక్షణలో శ్రీ సీతారామ కళ్యాణం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ సీతారామ ఉత్సవమూర్తులను అద్భుతంగా అలంకరించి వేదికపై ఆసీనులను గావించారు. అనంతరము పాంచరాత్ర ఆగమం ప్రకారం వైష్ణవ సాంప్రదాయ పద్ధతిలో సాంప్రదాయ బద్ధంగా ఆలయ స్వస్తి పుణ్యావాచనము, విశ్వక్సేనుని ఆరాధన, కళ్యాణ రామునికి నూతన యజ్ఞోపవీత ధారణ, మధుపర్కము, కన్యాదాన మహా సంకల్పము, స్వామి అమ్మవార్ల యొక్క వంశవృక్ష ప్రకరణము, జిలకర బెల్లం లగ్నఘట్టం, మహా కలశ పూజ, మహా మాంగల్య పూజ తదితర పూజా క్రతువులు భక్తి పూర్వకంగా వేదమంత్రోచ్చారణతో అర్చకులు పూర్తి చేశారు. కళ్యాణ గడియలు సమీపిస్తూ ఉండడంతో కళ్యాణాన్ని తిలకించుటకు ఆలయానికి వచ్చిన భక్తుల సమక్షంలో పరమ పునీతమైన శ్రీ కోదండరామస్వామి కరముల స్పర్శతో లోకమాత సీతాదేవి మెడలో మాంగల్య ధారణ గావించారు. స్వామివారి పౌర్ణమి పరిణయాన్ని కనులారా వీక్షించి తరించుటకు పలు ప్రాంతాలకు చెందిన భక్తజన సందోహం ఆలయానికి తరలివచ్చింది. అర్చకులు నిర్వహించే పూజాక్రతువులను భక్తిశ్రద్ధలతో తిలకించి తన్మయత్వంలో ఆనందపులకితులయ్యారు. ఈ సందర్భంగా ఆలయమంతా రామయ్య కీర్తనలతో మరుమరోగింది.



## చింతపర్తి సంతలో రైతులకు అవగాహన



సంతలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**కేవీ పల్లె డిసెంబర్ 4 ప్రభాతవార్త:**
స్క్రబ్ టైఫస్ వ్యాధి పై గ్రామీణ ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని చింతపర్తి పీ. హెచ్. సి.ప్రధాన వైద్యులు డాక్టర్ జులేఖ బేగం అన్నారు. చింతపర్తి గ్రామం లో నిర్వహిస్తున్న గురువారం వారపు సంతలో స్థానిక పీ. హెచ్. సి. వైద్యులు జులేక బేగం ఆధ్వర్యంలో డిప్యూటీ హెల్త్ ఎద్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ రైతులకు, ప్రజలకు స్క్రబ్ టైఫస్ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్.ఈ.ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుచు స్క్రబ్ టైఫస్ అనేది ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్ఫెక్షన్. ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల కాటిళ్లు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. కాటు వేసిన చోట నల్ల మచ్చ (ఎస్కార్) ఏర్పడుతుంది మరియు తీవ్రమైన జ్వరం వస్తుంది.ఈ వ్యాధి లక్షణాలు, 5 రోజులకంటే ఎక్కువగా జ్వరం ఉండుట. శరీరంపై నల్ల మచ్చలు, తలనొప్పి, శరీర నొప్పులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, బలహీనత, అలసిపోవడం. ఈ వ్యాధి వల్ల ఊపిరి తిత్తులు, కిడ్నీ, మెదడు పనిచేయడంలో మందకోడి గా ఉంటాయి. ఈ వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్ష (ఐ. జి. ఎమ్. ఎలిసా) పరీక్ష ఏరియా హస్పటల్, జిల్లా హస్పటల్ లో ఉచితంగా చేస్తారు. చికిత్స లో భాగంగా డాక్టర్ ఇచ్చే డాక్సీ సైక్లిన్ లేదా అజిథ్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుంది. జ్వరం ఎక్కువ రోజులు ఉన్నవారు తక్షణం వైద్యుని సంప్రదించాలి.సూచించిన ప్రకారం పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని మరియు వ్యాధి ఎలా నివారించాలి అనే దానిపై సాధారణ ప్రజల కోసం సూచనలు పాటించాలని తెలిపారు. మైట్ నివాసాలను తగ్గించడానికి కీటకనాశకాలు డి. డి. టి. లేక పైరిత్రం వంటివి స్ప్రేగా ఉపయోగించాలి. ఈ కార్యక్రమం లో సి. హెచ్. ఓ. అరుణ, పర్యవేక్షకులు భానుబీ, సీనియర్ ఏ. ఎన్. ఎమ్ హృదఈశ్వరి, ఆశాకార్యకర్తలు స్వరూప, రమణమ్మ, అనురాధ, పార్వతి పాల్గొన్నారు.

## స్మశానానికి దారెటు ?

**బద్వేలు, డిసెంబర్4 (ప్రభాతవార్త):**



మండల పరిధిలోని దళితవాడలో దళితవాడ ప్రజలకు స్మశానం లేక చాలా ఇబ్బందుదులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఉన్న స్మశాన వాటికలో మట్టి తవ్వకాలు చేయడం వలన పెద్ద గుంతలు ఏర్పడి చనిపోతే ఖననం చేసే పరిస్తితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం చెరువులను సైతం ఆక్రమించుకుని షెడ్లు వేసుకోవడం, నిర్మాణాలు, పశువుల పాకలు ఏర్పాటు చేసుకోవడం లాంటివి బడానాయకులు చేయడం వలన స్మశానాలకు స్థలం లేక చనిపోతే ఖననం చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కూలిపోవడానికి సిద్ధంగా ప్రభుత్వ పాఠశాల




**సిద్ధవటం, డిసెంబర్ 4 ప్రభాతవార్త**
సిద్ధవటం మండలం రామస్వామి పల్లె ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల అధిక వర్షాల కారణంగా పై కప్పు పెచ్చులూడుతూ క్రింద పడడంతో విద్యార్థులు భయాందోళనకు గురయిపోతున్నారు గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా రూపు రేఖలు మారుస్తామని చెప్పిన రామస్వామి పల్లె పాఠశాల శిథిల అవస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది ఈ సందర్భంగా స్కూల్ హెడ్మాస్టర్ రెడ్డయ్య గురువారం మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షపు నీరు తో జలమయమైపోయిందని పై కప్పు పెచ్చులు ఊడి క్రింద పడడంతో విద్యార్థులు భయాందోళనతో గురైపోతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారులు నూతన పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని విద్యార్థులకు మధ్యాహ్నాము అందిస్తున్న వంటగది, పాఠశాల గదులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆరుబయటే విద్యాబోధన అందిస్తున్నామని అధికారులు పరిశీలించి నూతన పాఠశాల భవనం మంజూరు చేయాలని అన్నారు ఈవిషయమై మండల విద్యాశాఖ అధికారి అరుణ వివరణ కోరగా రామస్వామిపల్లె, గొల్లపల్లి గ్రామాల్లో ఉన్న పాఠశాలల భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయని నూతన భవన పాఠశాల నిర్మాణం కొరకు ఉన్నత అధికారులకు నివేదిక పంపించామని మంజూరు అయిన వెంటనే పనులు మొదలు పెడతామని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఆ ప్రాంతాలలో పర్యటించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తామన్నారు.



కాశినాయన ఆరాధన మహోత్సావాలల్లో పాల్గొన్న వైయస్ఆర్సీపీ బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి